# 60 ఫీట్ల రహదారికి గ్రీన్ సిగ్నల్

- జెక్‌కాలనీ రోడ్డునెంబర్–1కు మహర్దశ
- ప్రవేశద్వారం నుంచి హనుమాన్ దేవస్థానం కమాన్ వరకు విస్తరణ

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ ఎదురుగా జెక్‌కాలనీ ప్రవేశద్వారం (రోడ్డు నెంబర్–1) నుంచి సనత్‌నగర్ హనుమాన్ టెంపుల్ కమాన్ వరకు 60 ఫీట్ల రహదారిగా మార్చనున్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ రహదారిని విస్తరించేందుకు ఇప్పటికే ఆర్‌డీపీ (రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్) అప్రూవల్ కూడా రావడంతో అందుకు సంబంధించిన కసరత్తులు మొదలుపెట్టారు. ఈ విషయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా సీరియస్‌గా ఉండడంతో పాటు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వ్యక్తిగత ఆస్తుల సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ రహదారిలో 29 నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.



జెక్‌కాలనీ ప్రవేశ ద్వారం

### నిర్మాణాల తొలగింపుపై దృష్టి..

అయితే ఏ ఆస్తి ఎంతమేర పోతుందనే అంశంపై ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు. ఈ రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎర్రగడ్డ ప్రధాన రహదారి నుంచి జెక్‌కాలనీతో పాటు హనుమాన్ దేవస్థానం (17 ఆలయాల సమాహారం), హిందూ పబ్లిక్ స్కూల్, కళాశాలలు, ఎస్‌ఆర్‌టీ కాలనీ, తులసీనగర్, సౌభాగ్యనగర్, కైలాష్‌నగర్ ఇలా చాలా కాలనీలు, బస్తీలకు ఇదే ప్రధాన రహదారితోపాటు దగ్గరి దారి కూడా ఇదే. ఈ క్రమంలో ప్రస్తుతం 30 ఫీట్లు ఉన్న ఈ రహదారి అసలే ఇరుకుగా ఉండడంతో పాటు అక్రమ పార్కింగ్, చిరు వ్యాపారాల నిర్వహణతో మరింత కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్యకు కారణమైంది. ఈ నేపథ్యంలో మాస్టర్ ప్లాన్‌లో సూచించిన మేరకు ఈ రహదారిని 60 ఫీట్లుగా మార్చేందుకు అధికారులు కదిలారు. ఈ రహదారి విస్తరణతో ఆస్తులు కోల్పోతున్న బాధితులకు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. అయితే దీనికి బాధితులు ఎంతమేర అంగీకరిస్తారో వేచి చూడాలి.

### మంత్రి వర్సెస్ కార్పొరేటర్..

మాస్టర్ ప్లాన్ ప్రకారం జెక్‌కాలనీ రోడ్డునెంబర్–1ను 60 ఫీట్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తారనే విషయం తెలియక హనుమాన్ దేవస్థానం తరుపున దాతల సహకారంతో ఇక్కడ ఆర్చి నిర్మాణ పనులు చేపట్టగా పునాది పనులు జరుగుతున్నాయి. అయితే రోడ్డు విస్తరణ ఉండడంతో పనులు ఆపాల్సిందిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సనత్‌నగర్ కార్పొరేటర్ ఆర్చి నిర్మాణ విషయంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పనులు కొనసాగించుకోవాల్సిందిగా చెప్పినట్లు మరో సమాచారం. ఒకవైపు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పనులు ఆపాలని చెబుతుండగా, ఇంకోవైపు పనులు చేసుకోవాల్సిందిగా కార్పొరేటర్ సూచిస్తుండడం పట్ల హనుమాన్ దేవస్థానం అధికారులు అయోమయంలో పడ్డారు. చివరకు ఆర్చి పనులను నిలిపివేశారు.



ఆర్చి నిర్మాణం కోసం చేపట్టిన పనులు

#### ఆస్తులపై సర్వే చేస్తున్నాం..

గోకుల్ థియేటర్ ఎదురుగా గల జెక్‌కాలనీ ప్రవేశద్వారం నుంచి హనుమాన్ దేవస్థానం కమాన్ వరకు 60 ఫీట్లుగా మార్చేందుకు ఆర్‌డీపీ అప్రూవల్ వచ్చింది. ఆ మేరకు 29 ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాం. ప్రస్తుతం ఏ ఆస్తి ఎంతమేర పోతుందనే సర్వే చేస్తున్నాం. ఆర్చి నిర్మాణాన్ని ప్రస్తుతం నిర్మించినప్పటికీ రోడ్డు విస్తరణలో తొలగించాల్సి వస్తోంది.

– మనోహర్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్

## బడుల రూపురేఖలు మార్చేందుకే మనబస్తీ–మనబడి

**సనత్‌నగర్:** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకే మనబస్తీ–మన బడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ నియోజకవర్గ పద్మారావునగర్‌లోని మైలార్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను రూ.18.92 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించి తరగతి గదులు, ఫర్నీచర్, టాయిలెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో 26065 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 9,123 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.7,289 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ జిల్లాలో 239 పాఠశాలను ఎంపిక చేసి రూ.44 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ప్రహరీ, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్, మంచినీటి సౌకర్యం, ఫర్నీచర్ కొనుగోలు తదితర 12 రకాల అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా టేబుల్స్, బెంచీలు, ఇతర ఫర్నీచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్పొరేటర్ హేమలత, డీఈఓ రోహిణి, గజ్జెల నగేష్, టీఎస్‌ఎంఐడీసీ చైర్మన్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శించిన మంత్రి తలసాని

**పాఠశాలల అభివృద్ధే లక్ష్యం..**

**కంటోన్మెంట్:** పాఠశాలల అభివృద్ధే మన బస్తీ మన బడి ఉద్దేశమని మంత్రి శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధి ని పికెట్‌లోని లక్ష్మనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో రూ.36.28 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని బుధవారం ఆయన ఎమ్మెల్యే సాయన్న, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చాలి.. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలనే సీఎం ఆలోచన మేరకు మన బస్తీ మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

## అంధత్వ నివారణే కేసీఆర్ లక్ష్యం

**రసూల్‌పురా:** రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందజేసి అంధత్వం లేని రాష్ట్రం కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ బోర్డు తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఈ పథకాన్ని పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల సీఎంలు కూడా అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు శ్యామ్‌కుమార్, ప్రభాకర్, నళిని కిరణ్, రాజుసింగ్, యశ్వంత్, శ్రీకాంత్, సురేష్, సోమయ్య, బంటీ, శేఖర్, గోపి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

## లష్కర్ రహదారులను ఆధునికీకరించాం

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రహదారులకు మహర్దశ చేకూర్చామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అంతర్గత, ప్రధాన రహదారులను ఆధునికీరించామన్నారు. ఎప్పటికప్పుడు రహదారుల మరమ్మతులు చేపడుతూ ప్రయాణికులకు మార్గం సుగమం చేస్తున్నామని చెప్పారు. చిలకలగూడ ప్రాంతంలో స్థానికుల ఫిర్యాదు మేరకు కిందిబస్తీ ప్రాంతంలో సీవరేజీ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని జలమండలి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

## నేడు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

**లాలాపేట:** తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద నిర్మాణం చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకుండా పోయింది. గత నెల 23న 'నాలుగు నెలలన్నారు..రెండేళ్లైంది' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత యంత్రాంగం కదిలి గురువారం (నేడు) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేసినట్లు డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి హాజరై బ్రిడ్జిని ప్రారంభిస్తారన్నారు.

## నియామకం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఎగ్జామినేషన్ నూతన కంట్రోలర్‌గా ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.రాములు నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల యజమానుల సంఘం ఉపాధ్యక్షులు పరమేశ్వర్, రామారావు, బాలకృష్ణారెడ్డి, చంద్రయ్య తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

## రౌడీషీటర్‌కు 7రోజుల జైలుశిక్ష

**అమీర్‌పేట:** అమీర్‌పేట మైత్రీవనమ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చిరు వ్యాపారులను బెదిరిస్తున్న రౌడీషీటర్‌కు కోర్టు ఏడ్రోజుల జైలు శిక్ష విధించింది. బౌద్ధనగర్‌కు చెందిన గణేష్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. మైత్రివనమ్ చౌరస్తాకు వెళ్లే రోడ్డుమార్గంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న కొబ్బరి బొండాలు, టీ స్టాళ్ల నిర్వాహకుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గణేష్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ సీట్లు ఇతరులకు కేటాయింపు

విద్యార్థి నేతల ఆరోపణ

**ఉస్మానియా యూనివర్సిటీ:** పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష అర్హత మార్కులను తగ్గించాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. వీసీ ప్రొ.రవీందర్‌పై విడుదల చేసిన 21 అంశాల చార్జిషీట్‌పై చర్చించేందుకు ఆర్ట్స్ కాలేజీ వద్దకు రావాలని ఓయూ విద్యార్థి నాయకులు ఎదుట ఎదురు చూశారు. వీసీ రాకపోవడంతో మార్కులను తగ్గించే వరకు పీహెచ్‌డీ ప్రవేశాలను నిలిపివేయాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పాలన భవనం చేరుకున్న విద్యార్థులు పీహెచ్‌డీ అర్హత మార్కుల తగ్గింపు విషయమై వీసీ అనుసరిస్తున్న విధానాల పై రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో తీవ్ర వాగ్వాదం చేశారు. అర్హత మార్కులు లేవని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సీట్లను ఇతరులకు కేటాయించే యోచనలో అధికారులు ఉన్నట్లు విద్యార్థి నేతలు ఆరోపించారు. వీసీ ప్రొ.రవీందర్‌తో సంప్రదింపుల ల కోసం ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ ఓయూ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి నేతలతో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా గత నెల 31న వీసీ చాంబర్‌లో ఆందోళన చేపట్టిన 20 విద్యార్థుల పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.



ఆర్ట్స్ కాలేజీ ఎదుట కూర్చున్న విద్యార్థులు

## ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధమవ్వాలి

**లాలాపేట:** ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం లాలాపేటలో జరిగిన తార్నాక డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు, రేషన్ కార్డుల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతుందన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని లేకుంటే కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తార్నాక డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌కే. లతీఫ్, సహాయ కార్యదర్శులుగా రహమతుల్లా, గువ్వల మల్లేష్‌చారితో పాటు 15 మంది సభ్యులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఖాన్, కొమురెల్లి బాబు, నర్సింహ, యాకయ్య, మహ్మద్ అఖిల్, సంజూ, సంజీవరెడ్డి, వెంకటేష్,గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



కేంద్రాన్ని ప్రారంభించిన కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

**సనత్‌నగర్:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి సూచించారు. సనత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు సనత్‌నగర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తమ ఇంటి దగ్గరకే కంటి వైద్య సేవలను ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఇలాంటి తరహా సేవలు దేశంలో మరెక్కడా లేవన్నారు. ఉదయ్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో శేఖర్, పురుషోత్తం పాల్గొన్నారు.

## భవనాల సామర్థ్యంపై అధికారుల ఆరా

**సనత్‌నగర్:** బేగంపేట సర్కిల్ పరిధిలోని భవనాల సామర్థ్యంపై బుధవారం ఆయా శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు భవనాలను గుర్తించారు. ఇటీవల జరిగిన దక్కన్ మాల్ అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. దీనిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి నేతృత్వంలో డీఎఫ్‌ఓ యజ్ఞ నారాయణ, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టాఫర్, ఫైర్ ఆఫీసర్ మోహన్, ఎలక్ట్రికల్ సిటీ సబ్ ఇంజనీర్ రాజేష్ బృందం భవనాలను పరిశీలించారు. ఎల్‌ఐసీ భవనం, ప్యారడైజ్ హోటల్, సన్‌షైన్ హాస్పిటల్, తదితర భవనాలను సందర్శించి అనుమతులతో పాటు ఫైర్‌సేఫ్టీ, ఎన్‌ఓసీ, ట్రేడ్ లైసెన్స్ వంటి అంశాలపై ఆరా తీసి సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫైర్‌సేఫ్టీ, ఎన్‌ఓసీ లేకుండా వ్యాపార, వాణిజ్య భవనాలు ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో బయటపడినట్లు సమాచారం. పరిశీలనలో మోండా మార్కెట్ ఎస్‌ఐ లక్ష్మయ్య, టౌన్‌ప్లానింగ్ చైన్‌మెన్ నర్సింగరావు పాల్గొన్నారు.



భవనాల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

## 12న రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్

**సనత్‌నగర్:** సేవా భారతి తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 12న రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం అమీర్‌పేటలోని జిగ్యాస హాల్లో జరిగిన ఆ సంస్థ ఏడో ఎడిషన్ సన్నాహక కార్యక్రమంలో వరల్డ్ మారథాన్ రన్నర్ సునీతా తుమ్మలపల్లి, సేవా భారతి తెలంగాణ అధ్యక్షులు దుర్గారెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ సుమలత, ఫ్రీడం ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సునీతా తుమ్మలపల్లి మాట్లాడుతూ.. 7200 మంది బాలికలకు విద్య, జీవిత నైపుణ్యం, సాధికారితపై శిక్షణ ఇస్తున్న సేవా భారతిని అభినందించారు. బాలికా సాధికారతపై అవగాహన కల్పించేందుకు సేవా భారతి ఆధ్వర్యంలో జరిగే రన్‌ఫర్ ఏ గర్ల్ చైల్డ్‌ను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు దుర్గారెడ్డి, డాక్టర్ సుమలతలు పేర్కొన్నారు. మురికివాడలు, బస్తీల్లోని ఆడ పిల్లలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్య అభివృద్ధి, వృత్తిలో మార్గదర్శకత్వం అందించడానికి సేవాభారతి 300లకు పైగా బాలికా సాధికారత కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు.

## ఘనంగా మాచదేవ జయంతి

**సికింద్రాబాద్:** మెట్టుగూడ కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రజకుల హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టిన మడివాల మాచదేవ జయంతి వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రజక మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొని మాచదేవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి నేతృత్వంలో జరిగిన వేడుకలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు ప్రసన్న, రాధ, విజయ, జ్యోతి పాల్గొన్నారు.



## ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యం

- సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ యాత్రి సురక్ష
- పెరిగిన నేరాల నియంత్రణ శాతం

**ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత చటోపాధ్యాయ బెనర్జీ**

**అడ్డగుట్ట:** ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ముందడుగు సాగడంతో పాటు మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం ఆర్‌పీఎఫ్ కృషి చేస్తోందని సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత చటోపాధ్యా బెనర్జీ పేర్కొన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్‌లోని ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

### పెరిగిన రికవరీ..

- ప్రయాణికుల భద్రతతో పాటు నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ఆపరేషన్ యాత్రి సురక్ష ద్వారా భారతీయ రైల్వేలో ప్రయాణించే ప్రయాణికుల భద్రతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో 'సేవా హి సంకల్ప్' పేరుతో పాన్ ఇండియా ఆపరేషన్‌ను ప్రారంభించిందని వివరించారు.
- 2022లో మిషన్ 'ఆపరేషన్ యాత్రి సురక్ష' ద్వారా సికింద్రాబాద్ డివిజన్‌లో 112 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుని వారి నుంచి 133 మంది ప్రయాణికులకు సంబంధించిన సొత్తును స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు ఆమె వెల్లడించారు.
- 2021లో కన్నా 2022లో నేరస్తులను పట్టుకోవడంలో 70 శాతం పెరుగుదల ఉన్నట్లు చెప్పారు. అదే విధంగా ఆపరేషన్ నార్కోస్ పేరుతో రైళ్లలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టింది. ఈ అక్రమ రవాణా వ్యాపారాల్లో పాల్గొన్న డ్రగ్ పెడ్లర్లను లక్ష్యంగా చేసుకొని ఎన్‌సీబీ, ఎల్‌ఈఏల సమన్వయంతో ఆర్పీఎఫ్ పోలీసులు డివిజన్ వ్యాప్తంగా గుర్తించబడిన బ్లాక్ స్పాట్‌లలో తనిఖీలను ముమ్మరం చేశారన్నారు.



- మొత్తం 20 రైళ్లకు 30 మంది అధికారులు, సిబ్బంది నార్కొటిక్స్ డిటెక్షన్‌లో సుమారు
- రూ.7.84 కోట్ల విలువైన 1218 కేజీల మాదక ద్రవ్యాలను ఈ సంవత్సరంలో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఆర్పీఎఫ్ పోలీసులు చేసిన ప్రయత్నాల కారణంగా గంజాయి రికవరీలో గత సంవత్సరంతో పోలిస్తే రికవరీ శాతం పెరిగిందన్నారు.

### మహిళల భద్రతకు శక్తి టీమ్స్..

- సికింద్రాబాద్‌లో డివిజన్‌లో మహిళల భద్రతను పెంపొందించడానికి శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో మొత్తం 16 మంది మహిళ ఆర్పీఎఫ్ పోలీసులు ఉంటారు. మహిళా ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు.
- ఆపరేషన్ మహిళా భద్రత ద్వారా కేవలం 100 రోజుల్లో 56 మంది దొంగలను పట్టుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లో మహిళ ప్రయాణికులు నిర్భయంగా ప్రయాణించేందుకు వీలుగా ప్రయాణికుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు శక్తి టీమ్స్ నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు.
- 'ఆపరేషన్ అమానత్' ద్వారా ప్రయాణికులు పోగొట్టుకున్న వారి వస్తువులను గుర్తించి తిరిగి అప్పగించామన్నారు. సుమారు రూ. 2.28 కోట్ల విలువ గల (ల్యాప్‌టాప్, ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్)లను తిరిగి ప్రయాణికులకు అప్పగించినట్లు తెలిపారు.
- కదులుతున్న రైళ్ల ఎక్కే, దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి ప్రయాణికులు మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయని అందువల్ల మిషన్ 'జీవన్ రక్ష' ద్వారా 103 మందిని రైల్వే పోలీసులు రక్షించినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే రెస్క్యూలో 24 శాతం పెరిగినట్లు వెల్లడించారు.

## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

**సనత్‌నగర్:** లాలాగూడ, ఐఐసీటీ సబ్‌స్టేషన్ల పరిధిలోని మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సండే మార్కెట్, నాగార్జుననగర్, షిర్డీ సాయినగర్, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ పార్కు.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దాల్‌మిల్–1, గుడిమెల్ల విల్లా, నాగార్జున కమ్యూనిటీ హాల్, అప్పారావు పేట, వైశాలి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

### నేడు ఐఏపీఎస్ఎం గోల్డెన్ జూబ్లీ వార్షిక సదస్సు

**లాలాపేట:** ఐసీఎంఆర్–ఎన్‌ఐఎన్ సహకారంతో బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ విభాగం ఈ నెల 2 నుంచి 4 వరకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్(ఐఏపీఎస్ఎం 50వ వార్షిక గోల్డెన్ జూబ్లీ జాతీయ సదస్సును నిర్వహిస్తుంది. తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్) ఆడిటోరియంలో జరిగే ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో సత్తా

**అమీర్‌పేట:** ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్‌లో ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థిని జాతీయ స్థాయిలో టాప్ మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ ఆంజనేయరెడ్డి తెలిపారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థిని బి.లక్ష్మీ ప్రసన్న 400 మార్కులకు 380 సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. అత్యున్నత బోధనా విధానం, క్రమశిక్షణే విద్యార్థుల విజయానికి కారణమైయ్యాయని ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నను, జోనల్ అడ్మిన్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఎస్.ఎం.వలీ, అధ్యాపకులు అభినందించారు.

### మార్చురీ ప్రాంగణంలో హరితహారం

**గాంధీఆస్పత్రి:** సికింద్రాబాద్ గాంధీ మార్చురీ ప్రాంగణంలో ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ కృపాల్ సింగ్, ప్రొఫెసర్ లావణ్యకౌసిల్ నేతృత్వంలో బుధవారం హరితహారం నిర్వహించి పలు రకాల మొక్కలను నాటారు. మార్చురీ వెనుక భాగంలోని ఖాళీ ప్రదేశాన్ని చదును చేయించి పచ్చందాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ కృపాల్‌సింగ్ మాట్లాడుతూ.. ఔషధ, పూలచెట్లు, మర్రి, రావి మామిడి, సపోట, సీతాఫలం వంటి పండ్ల మొక్కలను నాటామన్నారు. చెట్లు, పచ్చందాలు సంరక్షణకు సిబ్బందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మార్చురీ ప్రాంగణంలో పచ్చందాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్న వైద్యులు, సిబ్బందికి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అభినందించారు.

### నాగులూరి పార్కు సందర్శన

**చిలకలగూడ:** గార్డెన్ ఫెస్టివల్‌లో భాగంగా ఉద్యానవనశాఖ అధికారులు బుధవారం చిలకలగూడ నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కును సందర్శించి కంపోస్ట్ ఎరువు తయారీ, మొక్కల పెంపకం తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్‌సింగ్, సూపరింటెండెంట్ మహ్మద్ సాదత్‌ఖిఖార్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిఏటా గార్డెన్ ఫెస్టివల్ నిర్వహించి బహుమతులు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఏడో గార్డెన్ ఫెస్టివల్ కొనసాగుతోందని, గ్రేటర్ పరిధిలోని పార్కులను పన్నెండు కేటగిరీలుగా విభజించి, నిర్వహణ బాగున్న పార్కులకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్కు నిర్వహణ ప్రతినిధి మార్పల్లి రవి, సభ్యుడు మూర్తి, పలువురు ఉద్యానవనశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అవార్డు ప్రదానం



**సనత్‌నగర్:** ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం జరిగిన ఫిజియోథెరపీ వైద్యుల సమావేశంలో అత్యంత ప్రతిభ కనబరిచిన బేగంపేటకు చెందిన డాక్టర్ లక్షితా కైరాకు వైద్యరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ రజని, సేవారథ్ డాక్టర్ జి.చంద్రయ్య, ఫౌండేషన్ చైర్మన్ కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, నిరుపేదలకు సాధ్యమైనంతవరకు ఉచితంగా సేవలు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. లక్షిత మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సన్‌షైన్ హాస్పిటల్ ఎండీ గురువారెడ్డి, స్కిన్ స్పెషలిస్ట్ అంబుడాన్, ప్రభాకర్ పాల్గొన్నారు.